క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంరూరల్/కూసుమంచి: నేడు పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్‌లోని తరుణీహాట్‌లో ఏర్పాటు చేయపున్న ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల భవన నిర్మాణాల స్థలాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించనున్నారు. అనంతరం కూసుమంచిలోని పాత ఉన్నత పాఠశాలలో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ప్రస్తుత ఉన్నత పాఠశాల ఆవరణలో ఎనిమిదవ తరగతి విద్యార్థినులకు సైకిళ్లను, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారు.

పోస్టర్లు ఆవిష్కరణ

నేలకొండపల్లి: చదువును మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్స్ ఎంతో ఉపయోగపడుతుందని ఓపెన్ స్కూల్స్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.పాపారావు సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద బుధవారం వాటికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. 14ఏళ్లు నిండిన వారు పదో తరగతి లేదా ఇంటర్ ఉత్తీర్ణత పొందేందుకు ఈ నెల 31 వరకు అపరాధం లేకుండా అడ్మిషన్ పొందవచ్చని, పదో తరగతికి రూ.100, ఇంటర్‌కు రూ.200 అపరాధంతో ఆగస్టు 1 నుంచి 28 వరకు అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఎంఈఓ బి.చలపతిరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్, ఐకేపీ ఏపీఎం ఆర్.శ్రీనివాసరావు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులే మారాలి..

ఖమ్మంమయూరిసెంటర్: మారాల్సింది కమ్యూనిస్టులు కాదని మతోన్మాదులేనని, మతం పేరుతో దేశాన్ని అధోగతి పాలు చేస్తున్న బీజేపీ వైఖరిలో మార్పు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, పేదల పక్షాన ఉన్న కమ్యూనిస్టులు మారాలా లేక ఈ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్న బీజేపీ మారాలో తేల్చుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్, పి. శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని జలగంనగర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏదులాపురం మున్సిపల్ కేంద్రం పెదతండా సమస్యల సాధనకై ఆగస్టు 3న జరిగే ఉద్యోగ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊడుగు వెంకటేశ్వర్లు, శోభన్, మల్లయ్య, పి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం నగరంలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. తెలంగాణ ఉద్యమకారుడు దోకుపర్తి సుబ్బారావు కుమార్తె వివాహం ఇటీవల జరగగా.. వారి ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు.

ఆరోగ్యమస్తు..



రాపర్తినగర్‌లోని మామిళ్లగూడెం యూపీహెచ్‌సీ

మామిళ్లగూడెం యూపీహెచ్‌సీలో మెరుగుపడిన వైద్యసేవలు

- రెండు సార్లు వరించిన ఎన్‌క్వాస్ సర్టిఫికెట్
- రోజు రోజుకూ పెరుగుతున్న ఓపీ సేవలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత

ఖమ్మంవైద్యవిభాగం: మామిళ్లగూడెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సేవలు మెరుగుపడ్డాయి. నగరంలో ముస్తఫానగర్, శ్రీనివాసనగర్, వెంకటేశ్వరనగర్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నా.. ఆయా ప్రాంతాలు ఎక్కువగా స్లమ్ ఏరియాలో ఉన్నాయి. ఆ సెంటర్లలో రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటున్నా పట్టణ నడిబొడ్డున ఉన్న మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఇటీవల పేషంట్ల తాకిడి పెరిగింది. మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా వస్తున్నారు. దీని పరిధి కూడా ఎక్కువగా ఉండడంతో చిన్నారులకు వ్యాక్సినేషన్ కోసం ఎక్కువగా వస్తున్నారు. సెంటర్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఉన్నా.. మామిళ్లగూడెం యూపీహెచ్‌సీకి వస్తున్నారంటే వైద్య సేవల పనితీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సెంటర్ చుట్టూ 5 నుంచి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నవారు ఇక్కడకు ఎక్కువగా వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

పెరిగిన ఓపీ సేవలు...

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఈ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్నప్పటికీ ఓపీ సేవలు నిత్యం పెరుగుతున్నాయి. గతంలో 40 నుంచి 50 మంది పేషంట్లు మాత్రమే వచ్చేవారు కానీ ఇటీవల నిత్యం 70 నుంచి 90 మంది వరకు వైద్య సేవలు పొందేందుకు వస్తున్నారు. సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్ట్, ల్యాబ్‌టెక్నీషియన్ ఒక్కొక్కరు చొప్పున ఉండగా, ఆరుగురు ఏఎన్‌ఎంలు, 13 మంది ఆశలు, ఒక కమ్యూనిటీ ఆర్గనైజర్ వైద్య సేవల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ సెంటర్ పరిధిలో 6 సబ్‌సెంటర్లు ఉండగా.. మామిళ్లగూడెం, రాపర్తినగర్, రమణగుట్ట, వికలాంగుల కాలనీ, బురాన్‌పురం, లెనిన్‌నగర్, నెహ్రూనగర్, ద్వారకానగర్ ప్రాంతాల్లో మొత్తం జనాభా 68వేల మంది ఉండగా.. ఈ సెంటర్‌కు వైద్య సేవల కోసం వస్తుండడంతో సెంటర్‌పై భారం పడుతోంది. జనాభాకు తగిన రీతిలో సిబ్బంది ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిబ్బంది లేక.. ఇబ్బంది

మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రసవాలు జరగకపోయినా, గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవం అయ్యేంత వరకు ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పెద్దాస్పత్రికి పంపిస్తున్నారు. అలాగే బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు నిత్యం మందులు అందిస్తుండగా.. ప్రతీ బుధ, శనివారం ఇమ్యూనైజేషన్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా కుక్క కాటు, పాముకాటు, కోతులు కరిస్తే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సెంట్రల్ ల్యాబ్ నుంచి తెప్పిస్తున్నారు. ఇలా పగడ్బందీగా సేవలు అందిస్తున్నా.. సిబ్బంది కొరత మాత్రం వేధిస్తోంది. అయినా ఉన్న ఉన్న వారితోనే నెట్టుకొస్తున్నారు. కాగా, ప్రతీ 2 వేల మందికి ఓ ఆశ కార్యకర్త ఉండాల్సి ఉండగా.. 34 మందికి బదులు ప్రస్తుతం 13 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ఉన్న వారిపై పని భారం పడుతోంది. అయితే పీహెచ్‌సీల పరిధిలోని క్షేత్రస్థాయిలో మొదటి, రెండో ఏఎన్‌ఎంలు వినియోగిస్తుండగా.. మామిళ్లగూడెం యూపీహెచ్‌సీలో సెకండ్ ఏఎన్‌ఎంలు ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. మరో 10 మంది ఏఎన్‌ఎంలు అవసరం. సరైన సిబ్బందిని కేటాయిస్తే మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది.

ఎన్‌క్వాస్‌తో గుర్తింపు..

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల విభాగంలో మామిళ్లగూడెం సెంటర్ 2019, 2023 ఏడాదిలో రెండుసార్లు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ పొంది రికార్డు సాధించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల విభాగాల్లో ఎన్‌క్వాస్ సర్టిఫికెట్లు జారీ చేస్తుండగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆస్పత్రులకు సర్టిఫికెట్‌తో పాటు ప్రోత్సాహక నగదు కింద ప్రతీ ఏడాది రూ. 3లక్షల చొప్పున మూడేళ్ల పాటు అందిస్తుంది. ఆ నిధులను ఆస్పత్రి అభివృద్ధికి వెచ్చిస్తారు. ఇందులో డ్రెస్సింగ్ రూం, ఎమర్జెన్సీ విభాగం, జనరల్ క్లీనిక్, మెటర్నిటీ హెల్త్, న్యూబార్న్ అండ్ చైల్డ్ హెల్త్, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్, కమ్యూనికబుల్ అండ్ నాన్ కమ్యూనికల్ డిసీజ్, ఔట్ రీచ్, ఫార్మసీ, లేబరేటరీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో సెంటర్లకు వచ్చిన మార్కుల బట్టి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఇలా రెండుసార్లు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ పొంది రాష్ట్రస్థాయిలోనే ఈ సెంటర్ మంచి గుర్తింపు పొందింది.

పేషంట్లు పెరిగారు..



గత కొంత కాలంగా మామిళ్లగూడెం యూపీహెచ్‌సీకి పేషంట్లు ఎక్కువగా వస్తున్నారు. మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా వస్తున్నారు. ఆస్పత్రిలోని ల్యాబ్‌లో సీబీపీ, హెపటైటీస్, వీడీఆర్‌ఎల్, హెచ్‌ఐవీ తదితర పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన టెస్టుల కోసం శాంపిళ్లు సేకరించి పెద్దాస్పత్రికు పంపించి రిపోర్టులు తెప్పించుకుంటున్నాం. ప్రతీ బుధ, శనివారం ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వివిధ రకాల ఆరోగ్య కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నాం. రెండు సార్లు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ లభించడంతో సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బాధ్యత మరింత పెరిగింది.

– ఎస్.కృష్ణ చైతన్య, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి

కేఎంసీ ముచ్చట్లు..

ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 25వ డివిజన్‌లో లబ్ధిదారులకు మేయర్ పునుకొల్లు నీరజ ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలను సందర్శించిన కేఎంసీ కమిషనర్

నగరంలోని రాపర్తినగర్ బైపాస్ రోడ్డు పక్కన ఉన్న పశు వైద్యశాలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం సందర్శించారు. వైద్యశాలలో పశువులు, పెంపుడు జంతువులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశాక వైద్యశాలలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించి, కావాల్సిన సౌకర్యాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పట్టా అందిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

పారిశుద్ధ్యం అవగాహన

నగరంలోని 57వ, 16వ డివిజన్లలో మెప్మా అధికారులు, సీవోలు, ఆర్పీలతో కలిసి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, పారిశుద్ధ్యంపై కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ జె.అనిల్‌కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి పక్కాగా డ్రైడే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ జి.సుజాత పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ ఇరిగేషన్ ఫోరం ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: నగరంలోని టీఎన్జీఓస్ కార్యాలయంలో తెలంగాణ ఇరిగేషన్ నాన్ గెజిటెడ్ ఎంప్లాయిస్ ఫోరం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా టీఎన్జీఓస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ వ్యవహరించగా.. ఫోరం అధ్యక్షుడిగా డి.రాజకుమార్, కార్యదర్శిగా ఒ.భరత్‌రెడ్డి, కోశాధికారిగా సీహెచ్.లెనిన్ ఏకగ్రీవంగా ఎన్నికకాగా, కార్యవర్గ సభ్యులుగా జి.నాగేశ్వరరావు, భీముడు, రవితేజ, గోవిందు, హరిప్రసాద్, శ్రీనివాసులు, కృష్ణ కుమారి, బీబా సాహెబ్, రాము, శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, వాసు, అబ్దుల్, యాకూబ్, మదార్‌లు ఎన్నికయ్యారు. వీరిని టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్‌లు అభినందించారు.

హోంగార్డుకు బీమా చెక్కు అందజేత

ఖమ్మంక్రైం: విధులకు వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఖమ్మం యూనిట్‌కు చెందిన హోంగార్డు బాణాల రామాచారికి బుధవారం రూ.15 లక్షల చెక్కును సీపీ సునీల్‌దత్ అందజేశారు. యాక్సెస్ బ్యాంక్ ద్వారా వచ్చే ప్రయోజనాలు, ప్రమాద బీమా సొమ్ము మొత్తం రూ.15 లక్షలు రాగా ఆయన అందించారు. ఈనేపథ్యాన ఆయన కృత్రిమ కాలుకు ఆర్థిక సాయం అందించిన రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏసీపీ సుశీల్ సింగ్, హోంగార్డు ఆర్‌ఐ సురేష్, అప్పలనాయుడు, వైరా ఎస్సై రామారావులతో పాటు శ్రీను, వెంకటేశ్వర్లు, రవిబాబు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న సీపీ సునీల్‌దత్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, రేషన్ కార్డుల పంపిణీ..

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈనేపథ్యాన మండలంలోని రేగులచలక గ్రామానికి చెందిన కేతినేని వెంకటేశ్వర్లుకు రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎండపల్లి సత్యం అందించారు. నగరంలోని 8వ, 10వ డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుల పత్రాలు, కొత్త రేషన్ కార్డులను డివిజన్ కార్పొరేటర్లు లకావత్ సైదులు, చావా మాధురి, నారాయణరావు లబ్ధిదారులకు అందజేశారు.

12వేల ఆర్థిక సాయం

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ ఖమ్మం జిల్లా సీనియర్ నాయకుడు చింతమళ్ల వీరాస్వామి కుమారుడు గోపి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. బుధవారం ఖమ్మం బీజేపీ టూటౌన్ కమిటీ సభ్యులు రూ.12వేల ఆర్థిక సాయం అందించారు. వారి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఖమ్మంలో ఖమ్మం బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మందడపు సుబ్బారావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, కన్నికంటికృష్ణ చారి, రుద్రగాని మాధవ్, దొడ్డపునేని అప్పారావు, దాసరి మధు, యుగంధర్, వెంకట్, మహేంద్రసింగ్, నాగేందర్, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

ఖమ్మం సహకారనగర్: ఏడాదిన్నర కాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీపీటీ) జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సంఘం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఐవీ భాస్కరాచారి, వి. మనోహర్‌రాజు, మేరీ ఏసుపాదం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీతాలు చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్, ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదు, జనరల్ ఫండ్ క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం ఖమ్మం అర్బన్ మండలంలోని కేజీబీవీ, యూఆర్‌ఎస్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగం సతీష్, అజ్మీరా సోమ్లానాయక్, ప్రధాన కార్యదర్శి బి.రవికిరణ్, జ్యోతి, మాధవి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూ టీచర్స్ సమాఖ్య రఘునాథపాలెం మండలశాఖ ఆధ్వర్యాన రఘునాథపాలెం మండలంలో సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ నిర్వహించారు. మండల అధ్యక్షుడు గుర్రం కేశవరావు, ప్రధాన కార్యదర్శి తూమాటి సైదుబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాయల నరసింహారావులతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

3న లారీ యజమానుల సంఘం ఎన్నికలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎన్నికలను ఆగస్టు 3న నిర్వహించనుండగా.. బుధవారం నాటికి నామినేషన్లు, ఉపసంహరణ ప్రక్రియలు ముగిసినట్లు ఎన్నికల అధికారి కొత్త వెంకటేశ్వరరావు తెలిపారు. అధ్యక్ష పదవికి బోయపాటి కృష్ణకుమారి, రెండో ఉపాధ్యక్షుని పదవికి బాలు శ్రీనివాస్, మొదటి సహాయ కార్యదర్శి పదవికి షేక్ మస్తాన్ వలి, రెండో సహాయ కార్యదర్శి పదవికి మహ్మద్ అలీం, కోశాధికారి పదవికి చంద్ర సీతారం, కార్యవర్గ సభ్యులు పదవులకు ఇస్లావత్ సైదులు, కల్లట్లపల్లి వెంకన్న, గుమ్మడి శ్రీనివాస్, పల్స సైదులు, పోటు వెంకటేష్, భూక్యా కృష్ణ, మహ్మద్ ఇజహర్, ముప్పవరపు ఉపేందర్‌ల నుంచి ఒక్కో నామినేషన్లు దాఖలు కావడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. మొదటి ఉపాధ్యక్షుని పదవికి తేజావత్ వీరన్న, పొట్లపల్లి నర్సయ్యలు పోటీ పడుతుండగా.. ప్రధాన కార్యదర్శి పదవికి కొమ్ము మధుకుమార్, దగ్గు శ్రీనివాసరావు, షేక్ జానీబాబు, సుంకి మదారయ్యలు పోటీలో ఉండగా.. ఆగస్టు 3న సంఘ కార్యాలయంలో పోలింగ్, సాయంత్రం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.

నానో ఎరువులపై అవగాహన

రఘునాథపాలెం/కామేపల్లి: రఘునాథపాలెం మండలంలోని మంగ్యాతండా గ్రామపంచాయతీలో ఏఓ కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, కామేపల్లి మండలం కొత్తలింగాల, గోవింద్రాలలో ఏఓ తారాదేవి నానో యూరియా, డీఏపీ ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంట సాగుతో పాటు ఎరువుల సమర్థవంతమైన వినియోగంపై వివరించారు. కొండాయిగూడెం పెద్ద చెరువు ఆయకట్టు కింద నాట్లు వేస్తున్న రైతులకు పీఎస్‌బీ జీవన ఎరువుల వినియోగం విధానంపై క్షేత్ర స్థాయిలో తారాదేవి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు నాగార్జున, ఏఈఓలు వేదవ్యాస్, జగదీశ్వర్, భాస్కర్, ఉష, రైతులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు ఏఐటీయూసీ సంఘీభావం



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

ఖమ్మం మామిళ్లగూడెం: పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆగస్టు 7న ఖమ్మంలో జరిగే ర్యాలీకి అఖిలపక్ష కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి మద్దతు తెలిపింది. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, పాలిస్తీనా ప్రజలకు అండగా ఉండాలన్నారు. బుధవారం ఖమ్మం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ నరసింహారావు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు వై.పాషా ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించారు. జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, రావి శివరామకృష్ణ, శ్రీనివాస్, ఎం.లక్ష్మీనారాయణ, మోహన్ నాయుడు, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

తిరుమలాయపాలెం: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం టీయూసీఐ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ పాలేరు ఏరియా ఉపాధ్యక్షుడు మీగడ సైదులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికుల డిమాండ్లను ప్రభుత్వాలు పట్టించుకోకుండా కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ టైం స్కేల్ విధానాన్ని అమలు చేసి అన్యాయం చేసిందని అన్నారు. మోదీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 31న ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా మండల నాయకులు డి.వెంకన్న, ఎన్.బాబు, బిక్షం, రమేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మికుల సమస్యల పట్ల ఈనెల 31న జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను ప్రగతిశీల, కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు ఆవుల అశోక్ మాట్లాడగా.. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు కోటి లింగం, జ్యోతి, నాగలక్ష్మి, రేణుక, మధుర, చంద్రకళ, స్నేహలత, విజయ పాల్గొన్నారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు సత్కారం



పాఠశాలలో విద్యార్థినిని సత్కరిస్తున్న కరస్పాండెంట్ సాంబశివారెడ్డి

ఖమ్మం సహకారనగర్: యూపీఎస్సీ(2024 ఐఏఎస్ బ్యాచ్) సివిల్స్ పరీక్షలో జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్ సాధించిన వరంగల్‌కు చెందిన ఇ.రాజు, రజిత దంపతుల కుమార్తె ఇ.సాయిశివాని బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిశివాని, ఆమె తల్లిదండ్రులను శాలువ కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఐఏఎస్ బాధ్యతలు, ట్రైనింగ్, పరిపాలన విధులు ఏ విధంగా ఉంటాయో కలెక్టర్ వివరించారు. ఆతర్వాత సాయి శివాని తాను చదివిన నగరంలోని నిర్మల్ హృదయ్ పాఠశాలకు వెళ్లగా.. కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి ఘనంగా సత్కరించారు. తమ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

కామేపల్లి: మండలంలోని మంగలితండా, శ్రీరాంనగర్ ఎంపీపీఎస్ పాఠశాలల హెచ్‌ఎం వురిమెళ్ల రవికుమార్, బుర్రా పాల్‌జ్యోతి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆయా కాంప్లెక్స్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, హెచ్‌ఎం నాగేశ్వరరావు, శైలా, పి.రాములు, వెంకన్న, కృష్ణారావు, సురేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని పరామర్శ

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లికి చెందిన సీపీఎం నాయకుడు వెంకటబుచ్చి మృతి చెందగా.. బుధవారం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ కోసం పేదల కోసం ఎంతో పాటు పడ్డారని గుర్తుచేసుకున్నారు. సీపీఎం నాయకులు బి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పడిపోయిన కూలీ!

నేలకొండపల్లి: మండలంలోని బౌద్ధక్షేత్రం సమీపంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు (పురుషులు) బుధవారం నాట్లు వేస్తున్నారు. వారిలో శ్యామ్‌కు గుండెపోటు పొలంలోనే కుప్పకూలిపోయాడు. అదే సమయంలో అటువైపు వచ్చిన ఆటోడ్రైవర్ రాయబారపు రాము శ్యామ్‌ను ఆటోలో ఆస్పత్రికి తరలించి ఆపై ఖమ్మం తరలించారు.

వసతి గృహం పరిశీలన

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాన్ని బుధవారం ఎంఈఓ బి.చలపతిరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించాక వంట గదులు, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, తాగునీటి సరఫరా, టాయిలెట్లను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వసతి గృహం అధికారి, మండల సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పోడు రైతుల సమావేశం

రఘునాథపాలెం: పోడు రైతుల భూములకు పట్టాలు, దళితులకు ఇళ్లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధినేని కర్ణకుమార్, సీపీఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పంగిడి గ్రామంలో నిర్వహించిన పోడు రైతుల సమావేశంలో కర్ణకుమార్, పంగిడి నుంచి వెళ్తుండగా ఈర్లపూడి గ్రామానికి చెందిన దళితులు అడ్డుకుని ఇళ్ల గోడు వినిపించగా శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న సమస్యలు మాత్రం పరిష్కారం కావడం

సంక్షిప్తంగా..

లేదని మండిపడ్డారు. మంత్రి తుమ్మల స్పందించి పట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లుతో పాటు బాగం ప్రసాద్, కంపసాటి వెంకన్న, బత్తిని సీతారాములు, చీనా, రవి, లచ్చిరాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బొమ్మ'కు పేటెంట్ మంజూరు



పేటెంట్ పత్రాలు చూపిస్తున్న చైర్మన్ రాజేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బొమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకుల సామూహిక కృషితో అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత బయోసెన్సార్ రియల్‌టైమ్ డ్రగ్ పరికరానికి భారత ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసిందని బొమ్మ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. వాస్తవ కాల ఔషధ ప్రభావితా పర్యవేక్షణ పరికరం పేరుతో తయారైన ఈ ఆవిష్కరణను ఇండియన్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సంస్థ గుర్తించి పేటెంట్ నంబరు 455997001/205025 కింద ధృవీకరించినట్లు తెలిపారు. అనంతరం ఈ ఆవిష్కరణకు కృషి చేసిన డాక్టర్ విజయ్‌భాస్కర్, సంతోష్‌కుమార్, సుచరిత, సాయిబాబా, సంజన, బింధు, లక్ష్మీప్రియ తదితరులను కళాశాల కార్యదర్శులు ఉదారు శ్రీధర్, మాధవి, రాజ్యలక్ష్మి, అనుష అభినందనలు తెలిపారు.

పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి

నేలకొండపల్లి: పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు హెచ్చరించారు. బుధవారం మండలంలోని కోనాయిగూడెంలో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించి సిబ్బందికి చేయాల్సిన విధులపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ ఎం.యర్రయ్య స్థానిక గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు పారిశుద్ధ్యం గురించి వివరించారు. మండల పంచాయతీ అధికారి శివ, కార్యదర్శి బైరం దినేష్‌కుమార్, పద్మ, భాస్కర్ పాల్గొన్నారు.

దానవాయిగూడెం గురుకులం సందర్శన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని దానవాయిగూడెంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల సీఓఈ పాఠశాలను సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి బుధవారం సందర్శించారు. గురుకుల ఆవరణ, కిచెన్, స్టోర్‌రూమ్, మెస్, డార్మెటరీ, బాత్‌రూమ్స్ పరిశీలించి, విద్యార్థుల విద్యాభ్యాసం, ఫోన్‌మిత్ర సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కామేపల్లి: తమపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను పింజరమడుగు గ్రామానికి చెందిన బాధితులు చిప్పలపల్లి శ్రీనివాసరావు, రేణుక, లక్ష్మి కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఇటీవల తమను కులం పేరుతో దుషించడంతో పాటు దాడి చేసి గాయపర్చిన వారిని పోలీసులు అరెస్ట్ చేసి, తమకు రక్షణ కల్పించాలని కోరారు.

కుటుంబం చెంతకు విజయవాడ వాసి



సీఐ సమక్షంలో అప్పగిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన కుక్కమూడి రవికుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 17న ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో బంధువులను చూసేందుకు వచ్చికనిపించకుండా పోయాడు. దీంతో కుమారుడు బాబురావు అదే రోజున టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆతర్వాత ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ దొరకలేదు. బుధవారం కామేపల్లి మండలం పొన్నేకల్ గ్రామ పరిసరాల్లో ఆయన తిరుగుతుండగా.. స్థానికులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. గతంలో ఫౌండేషన్‌ను సంప్రదించిన ఆయన కుటుంబసభ్యులకు ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఫొటోలు పంపి కంఫామ్ చేసుకుని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ బి.బాలకృష్ణ సమక్షంలో రవికుమార్‌ను బాబురావుకు అప్పగించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సతీష్

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను బుధవారం కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డుల ప్రకారం స్టాక్‌ను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పైనంపల్లిలో ఆయిల్‌పామ్, వివిధ పంట క్షేత్రాల ప్రదర్శన నిర్వహించి సాగులో మెళుకువలను వివరించారు. ఏఓ ఎం.రాధ, ఏఈఓ దుర్గాభవాని, సొసైటీ సీఈఓ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

రొబోటిక్స్‌పై వర్క్‌షాప్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో కళాశాల ఫిజిక్స్ విభాగం – హైదరాబాద్ సోహం అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన బుధవారం రోబోటిక్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా మాట్లాడుతూ.. వైద్య, విద్యా రక్షణ తదితర కీలక రంగాల్లో రోబోటిక్స్ పాత్ర, అందులోని ప్రాథమిక సూత్రాలు, ప్రాజెక్టు డిజైన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు సూర్యాపేట జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి జె.అనిత, ఫిజిక్స్ అధ్యాపకులు బి.శ్రీనివాస్, కె.కిరణ్‌కుమార్, ఎస్.రాంబాబు, బి.రాజశేఖర్, పి.ధర్మయ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.